
ఇల్లందకుంట: శ్రీరాంలపల్లిలో మొక్కలను నాటుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వర్లు, సర్పంచ్ మొగిలి


వీణవంకలో హరితోత్సవం సందర్భంగా మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు

# ఉత్సాహంగా హరితోత్సవం

- **మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు, అధికారులు**
- **పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని పిలుపు**


జమ్మికుంట: మొక్క నాటుతున్న మున్సిపల్ పాలకవర్గం, అధికారులు, తదితరులు

జమ్మికుంట, జూన్ 19: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం బల్దియా ఆధ్వర్యంలో హరితోత్సవ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి, కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్ మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెం నర్సరీ పక్కన గల మాచినపల్లి రోడ్డులో మొక్కలు నాటారు. అనంతరం చైర్మన్, కమిషనర్ మాట్లాడుతూ.. హరితహారం గొప్ప కార్యక్రమమని, దీనికి శ్రీకారం చుట్టిన సీఎం కేసీఆర్ అభినందనీయుడని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం వల్ల పర్యావరణాన్ని కాపాడుకునే అవకాశం దక్కిందన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రజలు తమ ఇంటి ఆవరణ ఐదు మొక్కలు నాటు కోవాలని పిలుపునిచ్చారు. మొక్కలను సరఫరా చేసేందుకు మున్సిపల్ సిద్ధంగా ఉందన్నారు. జమ్మికుంటలో ఇప్పటి వరకు నాటిన, ప్రజలకు పంపిణీ చేసిన మొక్కలు, తదితర వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

***వీణవంకలో..***

వీణవంక, జూన్ 19: మండల కేంద్రంలో హరితోత్సవం కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలు ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామాల్లో ర్యాలీలు తీసి మొక్కల పెంపకం ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి మాట్లాడుతూ, హరితహారం కార్యక్రమంతో తెలంగాణలో పచ్చదనం పెరిగిందన్నారు. అభివృద్ధిలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాయిశెట్టి లత-శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో ప్రభాకర్, సర్పంచ్ నీల కుమారస్వామి, హైస్కూల్ హెచ్‌ఎం పులి అశోక్‌రెడ్డి, కేజీబీవీ ఎస్‌వో లావణ్య, పంచాయతీ కార్యదర్శి రవూఫ్, బీఆర్‌ఎస్ నాయకులు తాళ్లపెల్లి మహేశ్, రాయిశెట్టి సంపత్, జంపయ్య, నీల మొండయ్య, ఉపాధ్యాయులు ముల్కల కుమార్, శ్రీనివాస్, సంపత్‌రెడ్డి, ఉపాధిహామీ కూలీలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

***ఇల్లందకుంటలో..***

ఇల్లందకుంట, జూన్ 19: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామపంచాయతీల్లో హరితోత్సవం కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్, శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం, ప్రభుత్వ కార్యాలయాల ఎదుట మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు రాజు, మొగిలి, రాజిరెడ్డి, మానసామహేందర్, వనమాలావాసు, వెంకటస్వామి, మట్ట రజితావాసుదేవారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ తిరుపతి, దేవాలయ ఈవో కందుల సుధాకర్, సిబ్బంది మోహన్, రాజన్న, వివిధ మహిళా సంఘాల సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## హరితహారంతో పల్లెల్లో పచ్చదనం

**మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి**


తుమ్మనపల్లిలో మొక్క నాటుతున్న మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్ రూరల్, జూన్ 19: హరితహారం కార్యక్రమంతో పల్లెల్లో పచ్చదనం పెరిగిందని మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో హరితోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మొక్క నాటారు. అనంతరం మండలి విప్ మాట్లాడుతూ, మొక్కలు నాటేందుకు హరితహారం కార్యక్రమం చేపట్టి పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరినీ భాగస్వాములను చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. పచ్చని చెట్లతోనే వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించవచ్చని, ప్రజలందరూ తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట ఎంపీపీ ఇరుమల్ల రాణి, జడ్పీటీసీ పడిదం బక్కారెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గూడూరి ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీవో విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సుష్మ, బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు సురుకొంటి మాధవరెడ్డి, ఉపాధ్యక్షుడు మిడిదొడ్డి సురేశ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్, ఉప సర్పంచ్ బేతి రాజిరెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ ఏనుగు సత్యనారాయణరెడ్డి, డైరెక్టర్లు సుధాకర్‌రెడ్డి, యతీశ్వర్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి, రమాదేవితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## దేశానికే ఆదర్శం తెలంగాణ

సైదాపూర్, జూన్ 19: తెలంగాణ రాష్ట్రం సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని జడ్పీ వైస్ చైర్మన్ పేరాల గోపాలరావు, ఎంపీపీల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. హరితోత్సవ కార్యక్రమాన్ని సోమవారం మండల వ్యాప్తంగా నిర్వహించారు. వెన్నంపల్లిలో ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ గోపాలరావు సర్పంచ్ పద్మారవీందర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. అలాగే సోమారం, వెన్కేపల్లి గ్రామాల్లో ఎంపీపీల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి సర్పంచులు పైడిమల్ల సుశీలాతిరుపతిగౌడ్, కొండ గణేశ్‌తో కలిసి మొక్కలు నాటారు. మండలకేంద్రంలో వైస్ ఎంపీపీ రావుల శ్రీధర్‌రెడ్డి, ఎస్‌ఐ ఆరోగ్యం మొక్కలు నాటి, నీళ్లు పోశారు. పలు గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులను నర్సరీలకు తీసుకెళ్లి మొక్కల పెంపకం ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా జడ్పీ వైస్ చైర్మన్, ఎంపీపీ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతం అయిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పద్మావతి, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.


సైదాపూర్: సోమారం హరితోత్సవంలో ఎంపీపీల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సారబుడ్ల ప్రభాకర్ రెడ్డి తదితరులు

## బాధిత కుటుంబానికి పరామర్శ

హుజూరాబాద్ రూరల్, జూన్ 19: కనుకులగిద్ద గ్రామ సర్పంచ్ గోపు కొమురారెడ్డి ఈ నెల 17న రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, సోమవారం ఆయన కుటుంబాన్ని మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, జడ్పీటీసీ పడిదం బక్కారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు భిక్షపతి, రఘోత్తం రెడ్డి, మహేశ్ తదితరులు ఉన్నారు.

## జమ్మికుంట రూరల్ సీఐ బాధ్యతల స్వీకరణ



ఇల్లందకుంట, జూన్ 19: జమ్మికుంట రూరల్ సీఐగా కోరే కిశోర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన సిరిసిల్ల జిల్లా నుంచి ఇక్కడి బదిలీపై వచ్చారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ఇల్లందకుంట, వీణవంక ఎస్‌ఐలు తోట తిరుపతి, రాజశేఖర్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న కిశోర్

## ‘గెల్లు’ను కలిసిన ‘శ్రీపతి’

జమ్మికుంట, జూన్ 19: రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను సోమవారం జమ్మికుంట మున్సిపల్ 6వ వార్డు కౌన్సిలర్ శ్రీపతి నరేశ్ గౌడ్ హైదరాబాద్‌లోని కార్పొరేషన్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జమ్మికుంట పట్టణంలోని నాయిని చెరువులో బల్దియా ప్రజల కోసం బోటింగ్ ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందించారు. అందుకు స్పందించిన గెల్లు శ్రీనివాస్ యాదవ్, నాయిని చెరువును అధికారులతో పరిశీలించి బోటింగ్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఇక్కడ కౌన్సిలర్‌తో పాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులున్నారు.


గెల్లు శ్రీనివాస్ యాదవ్‌కు వినతి పత్రం అందిస్తున్న శ్రీపతి నరేశ్ గౌడ్

## ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

**ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి • గర్భిణులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ**


వీణవంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు న్యూట్రిషన్ కిట్స్ అందజేస్తున్న ఎంపీపీ రేణుక-తిరుపతిరెడ్డి, సర్పంచ్ కుమార్

వీణవంక, జూన్ 19: ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నదని ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గర్భిణులకు న్యూట్రిషన్ కిట్స్ పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమంతో మహిళల ఆరోగ్యానికి భరోసా కల్పించడంతోపాటు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలని గర్భిణులకు న్యూట్రిషన్ కిట్స్ అందజేయడం హర్షించదగిన విషయమన్నారు. ఈ కార్యక్రమం పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ప్రతి గర్భిణి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాయిశెట్టి లత-శ్రీనివాస్, సర్పంచ్ నీల కుమారస్వామి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో ప్రభాకర్, వైద్యాధికారి వరుణ, సూపర్‌వైజర్లు శ్రీధరాచారి, విజయ, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పాఠ్య పుస్తకాల పంపిణీ షురూ

హుజూరాబాద్ టౌన్, జూన్ 19: 2023-2024 విద్యా సంవత్సరానికి గానూ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు సోమవారం నుంచి ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. హుజూరాబాద్ మండలంలో 13 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఏడు ప్రాథమికోన్నత పాఠశాలలు, 32 ప్రాథమిక పాఠశాలలు, నాలుగు రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలు ఉండగా, 12 వేలకు పైగా విద్యార్థులు (తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియం) చదువుకుంటున్నారు. వారికోసం ఇప్పటికే జిల్లా కేంద్రం నుంచి హుజూరాబాద్ ఎంఆర్సీకి 16,910 ఉచిత పాఠ్య పుస్తకాలను విద్యాశాఖ అధికారులు పంపించారు. ఎమ్మార్సీ నుంచి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠ్య పుస్తకాలను తీసుకువెళ్లి విద్యార్థులకు అందజేస్తున్నారని హుజూరాబాద్ ఎంఈవో కేతిరి వెంకటనరసింహారెడ్డి తెలిపారు.

## ఇసుక తరలిస్తే చర్యలు తప్పవు

వీణవంక, జూన్ 19: మండలంలో ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని తహసీల్దార్ రాజయ్య స్పష్టం చేశారు. మండలంలోని కోర్కల్, మల్లారెడ్డిపల్లి, కొండపాక, పోతిరెడ్డిపల్లి, చల్లూరు గ్రామాల మానేరువాగు నుంచి జరుగుతున్న ఇసుక రవాణాను నిలిపివేయాలంటూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేయగా, కలెక్టర్ కర్ణన్ ఆదేశాల మేరకు సోమవారం ఆయన ఇసుక క్వారీల వద్దకు వెళ్లి పనులు నిలిపివేయించారు. మైనింగ్ అధికారులు, స్థానిక పోలీసులతో కలిసి ఇసుక రవాణా చేస్తున్న లారీలను నిలిపివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, ఎవరు ఇసుక తవ్వకాలు జరిపినా, ఇసుకను అక్రమంగా తరలించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

## శివాలయంలో మహాభిషేకం

జమ్మికుంట, జూన్ 19: వర్షాలు సకాలంలో, సమృద్ధిగా కురువాలని జమ్మికుంట అన్నపూర్ణ సేవా సమితి, ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో బొమ్మలగుడి(శివాలయం)లో సోమవారం ఉదయం 5 నుంచి 10గంటల వరకు శివ లింగానికి మహాభిషేకం చేశారు. మహాభిషేకంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గర్భగుడిలోని శివ లింగం మునిగేంత వరకు నీళ్లతో అభిషేకం చేశారు. అనంతరం భక్తులు మాట్లాడుతూ.. ఇంకా ఎండలు మండుతున్నాయని, వానలు వెంటనే పడాలని మహాభిషేకం చేశామని తెలిపారు. మహాభిషేకంతో సకాలంలో భారీ వర్షాలు పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక్కడ అన్నపూర్ణ సేవా సమితి సభ్యులు, ఆర్యవైశ్యులు, తదితరులున్నారు.


గర్భాలయంలో అభిషేక జలంలో శివలింగం